క్లుప్తంగా

వృద్ధులకు కంటి పరీక్షలు


రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

ఉండి : వయసు మీద పడుతున్నప్పుడు కంటి సమస్యలు తీవ్రంగా వేధిస్తాయని, ఆసుపత్రులకు వెళ్లలేని నిరుపేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా వైద్య సేవలు అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని ఎన్నార్పీ అగ్రహారం గ్రామ సర్పంచ్ సూరవరపు కనకదుర్గ అన్నారు. మంగళవారం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందించే ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు సూరవరపు వెంకటాచార్యులు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు


భీమవరం గరగపర్రు రోడ్డులో ఇళ్లను తొలగిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం గరగపర్రు రోడ్డులో విజయలక్ష్మి దియేటర్ సమీపంలో రోడ్డుకు ఆనుకుని ఉన్న ఆక్రమణల ఇళ్లను మంగళవారం మునిసిపల్ అధికారులు తొలగించారు. భీమవరం పట్టణ అభివృద్ధిలో భాగంగా తాడేపల్లిగూడెం రోడ్డులో అభివృద్ధి పనులు చేపట్టనున్న నేపథ్యంలో 67 ఇళ్లను తొలగించారు. అందులో 47 మందికి ఇప్పటికే ఇళ్లపట్టాలను ఇవ్వడం జరిగిందని కలెక్టర్, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఇళ్లు తొలగింపు చేసిన వారికి టిడ్కో ఫ్లాట్లలో ఆశ్రయం కల్పించడం జరిగిందని ఏసిపి గౌరు తెలిపారు. ఇళ్ల పట్టాలు ఇచ్చిన వారికి శాశ్వతంగా టిడ్కో ఫ్లాట్లు అందిస్తామన్నారు.

పోషకాహారంతో ఆరోగ్య జీవనం

వీరవాసరం : పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా మహిళలు ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాతరాణి తెలిపారు. వీరవాసం ఎంపీడీవో కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు. గర్భిణులు, బాలింతలకు కచ్చితంగా పౌష్టికాహారంపై ప్రతి ఒక్కరు అవగాహన కల్పించాలని సూచించారు. పోషకాహార వారోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని, తహసీల్దార్ సుందర్ రాజు, నాగరత్నం పార్వతి అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీ సెంటర్‌లో శిక్షణ

పాలకోడేరు : జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా విస్సా కోడేరులో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ వద్ద చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంపై గత నాలుగురోజులుగా శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది. ట్రైనింగ్ డీపీఆర్‌సీ టెక్నికల్ కోఆర్డినేటర్‌గా ఎన్.ఎడ్వర్డ్ వ్యవహరించారు. ఏడు మండలాల్లోని 42 గ్రామపంచాయతీలకు సంబంధించిన సర్పంచ్‌లు, సెక్రటరీలు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, క్లాప్ మిత్రలు సచివాలయ సిబ్బంది శిక్షణలో పాల్గొన్నారు.

యూనివర్సిటీ పోటీల్లో వైఎన్ కళాశాల విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

నరసాపురం: వైఎన్ కళాశాల మేనేజ్‌మెంట్ విద్యార్థులు ఇటీవల రాజమండ్రి నన్నయ యూనివర్సిటీలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించినట్టు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ చెప్పారు. బిజినెస్ ప్లాన్ ఈవెంట్‌లో ఎస్ హేమ ద్వితీయ బహుమతి, వీ. లక్ష్మీసునీత పాశ్చాత్య నృత్యంలో ప్రథమ బహుమతి సాధించారు. యూ.రవితేజ, ఎస్ మేమలు సావిస్కర 2కె23 టైటిల్‌ను సాధించారని చెప్పారు. విద్యార్థులను మంగళవారం ప్రిన్సిపాల్ అప్పన ఫణి, పీజీ కోర్సుల డైరెక్టర్ డాక్టర్ ఎన్ చింతారావు, డీన్ గంధం శ్రీరామకృష్ణ, డాక్టర్ చినిమల్లి శ్రీనివాస్ అభినందించారు.

అనధికార లే అవుట్‌లో రోడ్లు ధ్వంసం

నరసాపురం: పట్టణంలోని 16వ వార్డు గాంధీనగర్‌లో వేసిన అనధికార లేఅవుట్‌పై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకున్నారు. సుమారు 70 సెంట్ల స్థలంలో అనుమతులు లేకుండా వేస్తున్న లేఅవుట్‌ను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారులు మంగళవారం ధ్వంసం చేశారు. లేఅవుట్‌లో వేసిన రోడ్లు జేసీబీతో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ అనుమతులు లేకుండా లేఅవుట్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఓటు అడిగే హక్కు వైఎస్సార్ సీపీకే ఉంది

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్


భీమవరంలో ఆసరా పథకం చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం (ప్రకాశంచౌక్) : ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నందున నేడు ప్రతి కుటుంబం కూడా ఎంతో సంతోషంగా ఉందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం భీమవరం మండలం డ్వాక్రా మహిళలకు మూడో విడత ఆసరా నమూనా చెక్కును అందజేశారు. దీంతో 1662 డ్వాక్రా సంఘాలకు రూ.17.85 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ 2019 ఎన్నికలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను గత మూడున్నరేళ్లలో 98 శాతం అమలు చేసి రాజకీయాల్లో విశ్వసనీయతను తిరిగి నెలకొల్పారని అన్నారు. అంతేకాకుండా ప్రజా సంకల్ప పాదయాత్రలో అన్ని వర్గాల ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి నవరత్న పథకాలను అమలు చేస్తున్నారని, ఈ పథకాలను కూడా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేసే విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రూపకల్పన చేశారని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను నిర్ణీత గడువులోగా అందిస్తున్న ప్రభుత్వం దేశంలో ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. ప్రజల్లోకి వెళ్లి తమ ప్రభుత్వం ఏ విధంగా అర్హులైన ప్రతి ఒక్కరికి మేలు చేసిందో చెప్పుకునే ధైర్యం తమ పార్టీ శ్రేణులకు ఉందని, కానీ చంద్రబాబు ప్రజల్లోకి ఏ విధంగా వెళ్లగలరని ప్రశ్నించారు. 14 ఏళ్లుగా ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు ఆయన హయంలో పేదలకు ఒక్క సెంటు భూమైనా ఇచ్చారా అని ఆయన ప్రశ్నించారు. అంతేకాకుండా సంక్షేమ పథకాలను కూడా అమలు చేయలేదని గుర్తు చేశారు. అటువంటి చంద్రబాబు ప్రజల్లోకి వెళ్లి ఏ విధంగా ఓటు అడుగుతారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రశ్నించారు. పాదర్శకంగా పాలన చేస్తున్న వైఎస్సార్ సీపీకి మాత్రమే ప్రజల్లోకి వెళ్లి ఓటు అడిగి హక్కు ఉందన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఎస్ఎస్ఎస్ వేణుగోపాల్, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహారాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహారావు, ఎంపీడీవో రామచంద్ర ప్రభు, డిప్యూటీ తహసీల్దార్ గ్రంధి పవన్, ఏపీఎం యర్రంశెట్టి వేణుగోపాల్, మండల జేసీఎస్ కన్వీనర్ కోమటి రాంబాబు, సర్పంచులు రాట్నాల స్వామి, కోళ్ల బాలకృష్ణ, చిల్లే వెంకటేష్, నాగిడి నారాయణస్వామి, రామాని శివాజీ వర్మ, జల్లా కొండయ్య, తిరుమాని శ్రీనివాస్, ఆరేటి వెంకట సత్య వీరస్వామి నాయుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు,, పలువురు ఎంపీటీసీలతో పాటుగా కొట్టి కుటుంబ రావు, కొప్పర్తి సత్యనారాయణ, నామన మహేష్, బాబు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బొండాడలో నేటినుంచి శ్రీరామనవమి వేడుకలు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ మల్లికార్జున రావు

కాళ్ల : మండలంలోని బొండాడ గ్రామంలో భద్రాద్రి శ్రీరామచంద్రమూర్తి వార్షిక వేడుకలు బుధవారం నుంచి ప్రారంభమవుతాయని మాజీ ఎంపీపీ, ఆలయ కమిటీ చైర్మన్ కందుల మల్లికార్జున రావు తెలిపారు. గ్రామంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కందుల లక్ష్మణ స్వామి లక్ష్మి తులసమ్మల చేతులమీదుగా సుమారు 30 ఏళ్ల కిందట భద్రాద్రి రామచంద్రమూర్తి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం జరిగిందన్నారు. అప్పట్నుంచి స్వామివారి కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈనెల 29 నుంచి ఏప్రిల్ 4 వరకు ఈ వేడుకలు జరుగుతాయని తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి 7:30 గంటలకు కళాకారిణి జి రత్నశ్రీకి సువర్ణ కంకణంతో సన్మానం చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహారాజు, టీటీడీ పాలకవర్గ మాజీ డైరెక్టర్ గోకరాజు రామరాజు, వాసు, గాదిరాజు సుబ్బరాజు తదితరులు హాజరవుతారన్నారు. స్వామివారి కల్యాణ మహోత్సవాలను దిగ్విజయం చేయాలని మల్లికార్జునరావు కోరారు.

ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గం


ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఛాంబర్ నూతన కార్యవర్గం

సాక్షి, భీమవరం : భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఛాంబర్ భవనంలో మంగళవారం గన్నాబత్తుల వెంకటశ్రీనివాస్, మానేపల్లి నాగేశ్వరరావు తాత్కాలిక అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా ఏవీఆర్ సభాపతి, కార్యదర్శులుగా సంగడి వీరవెంకటశివసత్యనారాయణ, సుంకర సాయివెంకట నాగేశ్వరావు, కురిశేటి వెంకటసాయి రాంకుమార్, కాగిత వెంకట రమణారావు, ఉపాధ్యక్షులుగా తుమ్మలపల్లి నాగశివవెంకట సత్యకృష్ణమూర్తి, పులఖండం కోటేశ్వరరావు, కోట్ల వెంకట సూర్యనాగేశ్వరావు, కోశాధికారిగా చవ్వా శ్రీనివాస సుబ్బారావు, గౌరవాధ్యక్షుడిగా మానేపల్లి సూర్యనారాయణగుప్త మరొక 17 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం కార్యవర్గసభ్యులు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి

సాక్షి, భీమవరం : విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకున్నపుడే అనుకున్నది సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని సీఎస్ఎన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ 30వ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి సివిల్స్‌కు వెళ్లేందుకు ప్రయత్నాలు చేయాలన్నారు. సివిల్స్ వైపు అడుగులు వేస్తే ప్రజలకు సేవ చేసే అవకాశముంటుందన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో విద్యాసంస్థల అధ్యక్ష, కార్యదర్శులు ముత్యాల వెంకటరత్నం, డాక్టర్ చీడే సత్యనారాయణ, స్కూల్ ప్రిన్సిపాల్ నిర్మల, కళాశాల ప్రిన్సిపాల్స్ సకుమళ్ళ సత్యనారాయణ, ఎండీ సలీంఖాన్, వడుపు గోపి, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు తోట భోగయ్య, మానేపల్లి నాగన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతు పక్షపాతి సీఎం జగన్


తూర్పుపాలెంలో రైతు గ్రూపులకు పవర్ టిల్లరును పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతులకు అండగా నిలిచే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతిగా నిలిచారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. వ్యవసాయంలో ఆధునిక యంత్రాల పంపిణీలో భాగంగా రైతులకు అందించే పవర్ టిల్లరును మంగళవారం తూర్పుపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో వడలికి చెందిన అగస్త్యేశ్వర జేఎల్‌జీ గ్రూపుకు అందజేశారు. దేశంలోనే వినూత్నంగా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి అన్నదాతలకు అండగా నిలుస్తున్నారన్నారు. విత్తనం నుంచి పంట ఉత్పత్తుల అమ్మకాల వరకూ ఒకే చోట జరిగే విధంగా ఆర్‌బీకేలు ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలిచారన్నారు. రైతులందరూ సీఎం జగన్‌కు అండగా నిలవాలన్నారు.

గృహనిర్మాణం వేగవంతం చేయాలి

నియోజకవర్గంలో గృహనిర్మాణం వేగవంతం చేయాలని మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు అన్నారు. అభివృద్ధి పనులు, గృహనిర్మాణంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ లబ్ధి అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పోడూరు జెడ్పీటీసీ గుంటూరు పెద్దిరాజు, పార్టీ నాయకులు కాసాని పెద్దిరాజు, చిటికెన బాబీ, మద్దు శ్రీనివాసరావు, బండారు ప్రసాద్, మేకా సింహాద్రి అప్పన్న, చిటికెన శ్రీనివాసరావు, రంభ సూర్యనారాయణ పాల్గొన్నారు.

సొసైటీల ద్వారా రైతులకు ఉత్తమ సేవలు


సంఘ మహాజన సభ నిర్వహిస్తోన్న దృశ్యం

నరసాపురం: సొసైటీల ద్వారా ప్రభుత్వ సహకారంతో రైతులకు ఉత్తమ సేవలందిస్తున్నామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని నరసాపురం పీఏసీఎస్ అధ్యక్షుడు షేక్ బులిమస్తాన్ సూచించారు. మంగళవారం పీఏసీఎస్ మహాజనసభ సంఘ సభ్యులు, రైతులు సమక్షంలో నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన బులిమస్తాన్ మాట్లాడుతూ రైతుల కోరిక మేరకు తకవరలో డివిడెండ్ ప్రకటిస్తామని చెప్పారు. రైతులకు తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తున్నామన్నారు. ఎరువులు, పురుగు మందులు అందిస్తున్నామన్నారు. బ్యాంకులో లాకర్ల సదుపాయం కల్పించామని చెప్పారు. సొసైటీని మరింత అభివృద్ధి చేయడానికి ప్రణాళిక తయారు చేస్తున్నామని వివరించారు. సంఘ కార్యదర్శి మేడిది శ్రీనివసారావు వార్షిక నివేదికను ప్రవేశపెట్టారు.

సహకార సంఘం ద్వారా రైతులకు మరిన్ని సేవలు


మహాజన సభలో మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ మోటుపల్లి రామభాస్కరరావు

నరసాపురం రూరల్: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ద్వారా రైతులకు మరిన్ని సేవలందించనున్నట్టు మొగల్తూరు సొసైటీ చైర్మన్ మోటపల్లి రామభాస్కరరావు తెలిపారు. మంగళవారం సాయంత్రం సంఘ కార్యాలయంలో నిర్వహించిన మహజన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రూ.8,60,40,295 లావాదీవీలను సభ్యులు ఆమోదించారు. 2023-24 ఆర్థిక సంవత్సర అంచనా బడ్జెట్ రూ.1కోటి 6లక్షల 5వేల 500 లును సంఘ కార్యదర్శి కొత్తపల్లి గోవింద్ ప్రవేశపెట్టారు. ఈ సమావేశంలో డైరక్టర్లు రేవు విజయలక్ష్మీ రాంబాబు, బొడ్డుపల్లి సుబ్బారావు, రైతులు కొల్లాటి మూలాస్వామి, నిప్పులేటి మాణిక్యాలరావు, కొత్త ముత్యం పలువురు రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్ టీయూసీ ఆవిర్భావ దినోత్సవం


వైఎస్సార్ టీయూసీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్) : వైఎస్సార్ టీయూసీ 12వ ఆవిర్భావ దినోత్సవం స్థానిక కొత్త బస్టాండ్ వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భీమవరం ఆటో యూనియన్ అధ్యక్షుడు యింటి సత్యనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ వాహన మిత్ర ద్వారా ఆటో డ్రైవర్లను ఆదుకుంటున్నారని అన్నారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆటో డ్రైవర్ల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తామంతా అండగా నిలుస్తామని తెలిపారు. అనంతరం సంఘ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన మారోజు గణేష్‌ను సత్కరించారు. ముందుగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంపన గోపి, గుజ్జుల నిరీక్షణ రావు, చెన్నంశెట్టి వాసు, లింగాల చిన్నా తదితరులు పాల్గొన్నారు.

జక్కరంలో ప్రతి ఇంటికీ కుళాయి

హర్ ఘర్ జల్ అవార్డుకు ప్రతిపాదనలు


అవార్డుకు ప్రతిపాదనల పత్రాన్ని జలజీవన్ మిషన్ కోఆర్డినేటర్లకు అందజేస్తున్న సర్పంచ్, అధికారులు

కాళ్ల : ప్రతి ఇంటికి నూటికి నూరు శాతం కుళాయి కనెక్షన్ ఇచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జల జీవన్ మిషన్ పథకం ద్వారా హర్ ఘర్ జల్ అవార్డు సాధించే దిశగా జక్కరం గ్రామం అడుగులు వేస్తుంది. ఈ అవార్డుకు ఎంపిక కావాలనే లక్ష్యంతో సర్పంచ్ కూచంపూడి పద్మావతి, ఉపసర్పంచ్ కూచంపూడి లక్ష్మీపతిరాజు, పంచాయతీ అధికారుల సహకారంతో గ్రామ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. దీనిలో భాగంగా జలజీవన్ మిషన్ జిల్లా అధికారులు మంగళవారం జక్కరం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జలజీవన్ మిషన్ కోఆర్డినేటర్లు ఎస్.శ్రీనివాస్, ఏ. శ్రీనివాసు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రతి ఇంటికి కుళాయి కలెక్షన్లు ఇవ్వడంతో పాటు ప్రభుత్వ కార్యాలయంలో కూడా నూటికి నూరు శాతం పైపు కనెక్షన్ ఇవ్వటంలో గ్రామ సర్పంచ్, పంచాయతీ అధికారులు కృతనిశ్చయంతో పనిచేశారని అభినందించారు. గ్రామం సాధించిన ప్రగతిని రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రానికి పంపించనున్నట్లు వారు స్పష్టం చేశారు. జక్కరం గ్రామాన్ని స్ఫూర్తిగా తీసుకుని అన్ని గ్రామాల్లో నూటికి నూరు శాతం ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ టి.శ్రీనువాసరావు, పంచాయతీ కార్యదర్శి జమాల్ గ్రామ పెద్దలు ఉన్నారు.

ఉపాధి హామీ నిధులు సక్రమంగా వినియోగించాలి


పాలకోడేరులో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

పాలకోడేరు : ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజా వేదికలో అధికారులు ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరూ పాల్గొనాలని మండల పరిషత్ అధ్యక్షుడు భూపతిరాజు చంటి రాజు అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పనుల తనిఖీపై ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల అభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నాయని వాటిని సక్రమంగా ఖర్చు చేస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి అన్నారు. వాటిని సక్రమంగా వినియోగించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉందన్నారు. 2021- 22 ఆర్థిక సంవత్సరంలో మండలంలో రూ.5.38 కోట్లతో 827 పనులు చేపట్టినట్లు వెల్లడించారు. మండలంలోని 14 గ్రామాల్లో 3,500 మొక్కల నాటగా ప్రస్తుతం 2000 మొక్కలు మాత్రమే ఉన్నట్లు తనిఖీలలో బయటపడిందన్నారు. అయితే శృంగవృక్షం విస్సాకోడేరు, గొరగనమూడి, పెన్నాడ, కుముదవల్లి, పాలకోడేరు, మోగల్లు తదితర గ్రామాల్లో రెండో రైల్వే లైన్ వేయడంతో అడ్డు వచ్చిన మొక్కలను తొలగించడం జరిగిందని తనిఖీల్లో గుర్తించామన్నారు. విస్సాకోడేరు బల్క్ మిల్క్ సెంటర్ నిర్మాణానికి వచ్చిన రూ 1.26 లక్షల సిమెంట్‌ను రైతు భరోసా కేంద్ర నిర్మాణానికి ఉపయోగించారని వెల్లడైందన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ టీవీ రాజేశ్వరరావు, ఏపీడి విజయలక్ష్మి, ఎంపీడీవో నూకల మురళి గంగాధర్‌రావు, టెక్నికల్ అసిస్టెంట్ పిల్లి చిట్టి జయబాబు, సి ఓ మధు, అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కళాకారులకు సత్కారం

పాలకొల్లు అర్బన్: కళారంగానికి జాగు సత్యనారాయణ, మాదిరెడ్డి శ్రీనివాసరావు అందిస్తున్న సేవలు అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. పాలకొల్లు ఛాంబర్ కామర్స్ భవనంలో ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా సోమవారం రాత్రి నటీనట సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో ఘన సత్కారం చేశారు. ఈ సందర్భంగా కళాకారులు ఐవీ రావు, గుండా మురళీనాయుడు, మద్దాల వాసు ఏకపాత్రాభినయం చేసి ఆహుతులను అలరించారు. ప్రముఖ రచయిత లింగం సత్యనారాయణ పునః ప్రచురించిన భగత్‌సింగ్ సాంఘిక నాటకం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఉన్నమట్ల కబర్ధి, పలు కళా సంస్థల అధ్యక్షుడు జవ్వాది దాశరథి శ్రీనివాస్, చవ్వాకుల సత్యనారాయణమూర్తి, గుండా రామకృష్ణ, కేఎస్‌ఆర్‌కే గోపాలకృష్ణ, రావూరి జవాహర్‌లాల్ నెహ్రూ(చాచా), గంటా ముత్యాలనాయుడు సన్మాన గ్రహీతలను సత్కరించారు. సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకున్న నటీనట సంక్షేమ సమాఖ్య వర్కింగ్ అధ్యక్షుడు గుడాల హరిబాబును శాలువాతో సత్కరించారు. నటీనట సంక్షేమ సమాఖ్య అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కత్తుల రామమోహన్, టి.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి రూ.2.50 లక్షల మంజూరు


బాలుడి వైద్యం నిమిత్తం రూ.2.50 లక్షల చెక్కును అందజేస్తున్న జెడ్పీ చైర్మన్

పాలకొల్లు అర్బన్: పట్టణానికి చెందిన వడ్రంగి మేస్త్రి అన్నాబత్తుల ప్రసాద్ కుమారుడు కౌశిక్(4) గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. బాలుడు వైద్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ రూ.2.50లక్షలు మంజూరు చేయించారు. కౌశిక్ చెడు రక్తనాళం పూర్తిగా పాడైపోయింది. వైద్యం కోసం ఆర్థిక సహాయం మంజూరు చేయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దాడ గణేష్ భవాని, శ్రీ క్షీరారామ కార్పెంటర్ సంక్షేమ సంఘ అధ్యక్షుడు పోతాబత్తుల దుర్గాప్రసాద్ తదితరులు కవురు శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో శ్రీనివాస్ స్పందించి బాలుడు సమస్యను స్వయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి అత్యవసర శస్త్ర చికిత్స నిమిత్తం రూ.2.50లక్షలు మంజూరు చేయించి బాలుడు శస్త్రచికిత్సకు ఏర్పాట్లు చేశారు. దీంతో కవురు శ్రీనివాస్‌ని పాలకొల్లు వైసీపీ కార్యాలయంలో కౌశిక కుటుంబ సభ్యులు మంగళవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

అందుబాటులోకి డీఎన్నార్ ఇండోర్ స్టేడియం


డీఎన్నార్ కళాశాలలో ఇండోర్ స్టేడియంను ప్రారంభిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : పట్టణంలోని డీఎన్నార్ కళాశాలలో ఆధునీకరించిన ఇండోర్ స్టేడియంను మంగళవారం కళాశాల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూజీసీ, దాతల సహకారంతో ఇండోర్ స్టేడియంకు కొద్దిపాటి మరమ్మతులు చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు), అసిస్టెంట్ సెక్రటరీ కొత్తపల్లి శివరామరాజు, ఎంవీ గోపాలకృష్ణంరాజు, పి.రామకృష్ణంరాజు, అల్లూరి సురేంద్ర, ఫిజికల్ డైరెక్టర్ బీవీ నర్సింహరాజు తదితరులు పాల్గొన్నారు.

రామాలయానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న భక్తులు

భీమవరం (ప్రకాశంచౌక్) : పట్టణంలో పునఃనిర్మించిన సింహాద్రి అప్పన్న కోదండ రామాలయానికి పట్టణానికి చెందిన ముచ్చకర్ల గోవిందరావు తండ్రి తాతబ్బాయి జ్ఞాపకార్థం రూ.1,00,116 విరాళంగా అందచేశారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు రసీదు, ప్రసాదం అందచేశారు.

320 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

భీమవరం అర్బన్ : రాయలం గ్రామంలో మంగళవారం 320 పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి పి.పుండరీబాబు తెలిపారు. 280 గేదెలకు, 40 ఆవులకు ఈ వ్యాక్సిన్లు వేసినట్లు చెప్పారు. కొమరాడలో బుధవారం పశువులకు గాలికుంటు నివారణ వ్యాక్సిన్లు వేయనున్నట్లు పుండరీబాబు తెలిపారు.

ఇంగ్లీష్ భాషపై పట్టుకు ఉచిత శిక్షణ

ఆకివీడు : ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు వెళ్లే అభ్యర్థులకు ఇంగ్లీష్ భాషపై పట్టు సాధించేందుకు 40 రోజులపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలో వీవీ గిరి డిగ్రీ కళాశాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 40 రోజులపాటు ఇంగ్లీష్‌పై కోచింగ్ ఇస్తామన్నారు. సాయంత్రం 7 నుంచి 8 గంటల వరకూ శిక్షణ ఉంటుందన్నారు. అధ్యాపకులు కె.బాల గురవయ్య బోధిస్తారని ఆమె తెలిపారు.

డైలీ మార్కెట్ పాట రూ. 73.20 లక్షలు

ఆకివీడు : స్థానిక నగర పంచాయతీ అశీల వేలం మంగళవారం హోరాహోరీగా జరిగింది. ఉదయం కార్యాలయ ప్రాంగణంలో అశీల వేలం పాటదారులు, రేవులోని వ్యాపారస్తుల మధ్య వివాదం జరిగింది. దీంతో వేలంపాటను సాయంత్రం నాలుగు గంటలకు నగర పంచాయతీ కమిషనర్ తిరుమలరావు వాయిదా వేశారు. అనంతరం పాటలో డైలీ మార్కెట్ కార్ స్టాండ్‌కు మోటుపల్లి పెద్దిరాజు రూ.73.20 లక్షలకు, వారపు సంత రూ.3.06 లక్షలకు షేక్ అమర్, కబేల వేలం పాటను షేక్ చంటి సాహెబ్ రూ.38 వేలకు దక్కించుకున్నట్లు కమిషనర్ తిరుమల రావు చెప్పారు.

రైతులంతా కిసాన్ మేళాకు తరలిరండి

యలమంచిలి: మార్టేరు వరి పరిశోధన స్థానంలో బుధవారం నిర్వహించనున్న కిసాన్ మేళాకు మండలంలోని రైతులంతా తరలి వెళ్లాలని మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి కోరారు. ఈ కిసాన్ మేళాలో సుస్థిర వ్యవసాయం, స్థిరమైన ఆదాయం అనే అంశంపై చర్చావేదిక ఉంటుందన్నారు. అనంతరం క్షేత్ర సందర్శన, వ్యవసాయ పనిముట్ల ప్రదర్శన, క్విజ్ పోటీలు, రైతులతో శాస్త్రవేత్తల చర్చాగోష్ఠి జరుగుతుందన్నారు. ఆధునిక వ్యవసాయానికి ఉపయోగపడే విధంగా శాస్త్రవేత్తలు రైతులకు అనేక సూచనలు, సలహాలు ఇస్తారన్నారు.